క్లుప్తంగా

ఉచిత కంటి శస్త్ర చికిత్సలు

సాక్షి, సిటీబ్యూరో: కంచి కామకోటి మెడికల్ ట్రస్ట్,, శంకర ఐ ఫౌండేషన్‌లతో కలిసి జెపి ఎలక్ట్రానిక్స్ ఇండియా ఆధ్వర్యంలో కరీస్ రోష్ని: లైట్ ఫర్ ఎవ్రీ సైట్ అనే కార్యక్రమం చేపట్టినట్టు నిర్వాహక సంస్థ ప్రతినిధులు నగరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలిపారు. ప్రపంచ దృష్టి దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం నుంచి దీన్ని ప్రారంభిస్తున్నామని తెలిపారు. దీని ద్వారా కంటి శస్త్ర చికిత్స అవసరమైన 14,500మందికి చేయూత అందించనున్నామని, దీని కోసం 6 ఆసుపత్రులతో భాగస్వామ్యం కుదుర్చుకున్నామని వివరించారు.

ఓవరాల్ ఛాంపియన్ ఆకాశ్ హౌజ్

- ముగిసిన నాసర్ బాయ్స్ స్కూల్ వార్షిక క్రీడోత్సవాలు



ఆకాశ్‌హౌజ్‌కు ట్రోఫీని అందిస్తున్న అతిథులు

రాయదుర్గం: నాసర్ బాయ్స్ స్కూల్ వార్షిక క్రీడోత్సవాలలో ఓవరాల్ ఛాంపియన్‌గా ఆకాశ్ హౌజ్ గోల్డ్ మెడల్ అందుకుంది. ఈ సందర్భంగా గచ్చిబౌలిలోని నాసర్ బాయ్స్ స్కూల్ క్రీడామైదానంలో గురువారం సాయంత్రం నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాఠశాల కార్యదర్శి, డైరెక్టర్ మీర్ కుతుబుద్దీన్‌ఖాన్ చేతుల మీదుగా మెడల్, ట్రోఫీ, సర్టిఫికెట్లను అందించారు. అంతకు ముందు విద్యార్థుల కరాటే విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

15 నుంచి ఉత్సవాలు

రాయదుర్గం: విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో 15వ తేదీ నుంచి 24వ తేదీ వరకు దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. 15న గణపతి అభిషేకంతో ఉత్సవాలను ప్రారంభిస్తారు. మండప గణపతి పూజ, ప్రధాన కలశస్థాపన, అఖండ దీపారాధన, మండపపూజ, నవ చండీహోమం, చండీ పారాయణం నిర్వహిస్తారు. అన్నపూర్ణాదేవికి 9 రోజులపాటు వివిధ అలంకారాలు చేస్తారు. 15న భవానీదేవి, 16న బాలత్రిపురసుందరి, 17న గాయత్రీదేవి, 18న రాజరాజేశ్వరి, 19న లలితా త్రిపురసుందరి, 20న సరస్వతిదేవీ, 21న మహాలక్ష్మీదేవి, 22న దుర్గాదేవి, 23న మహిషాసురమర్దిని, 24న అన్నపూర్ణాదేవి అలంకారం చేస్తారని వివరించారు.

అరుదైన శస్త్ర చికిత్స



గచ్చిబౌలి: కడుపునొప్పితో బాధపడుతున్న మహిళ అండాశయంలో ఏర్పడిన కణితిని హిమగిరి ఆస్పత్రి వైద్యులు శస్త్ర చికిత్స ద్వారా తొలగించారు. 50 సంవత్సరాల మహిళ కడుపు నొప్పితో గచ్చిబౌలిలోని హిమగిరి హాస్పిటల్‌కు వచ్చింది. స్కానింగ్ చేయగా అండాశయంలో కణితి ఏర్పడినట్లు గుర్తించారు. ల్యాప్రోస్కోపిక్ సర్జరీ ద్వారా డాక్టర్ అభిలాష్ నాయక్, డాక్టర్ స్వాతిరెడ్డిల బృందం 10 కిలోల కణితిని తొలగించారు. రోగి పూర్తిగా కోలుకుందని తెలిపారు.

చెత్త సమస్య



బీడీఎల్ కాలనీ నుంచి ఎంఎంటీఎస్ రైల్వేస్టేషన్‌కు వెళ్లే రోడ్డులో పేరుకుపోయిన చెత్త

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతీనగర్ డివిజన్ బీడీఎల్ కాలనీ నుంచి ఎంఎంటీఎస్ రైల్వే స్టేషన్‌కు వెళ్లే మార్గం చెత్త డంపింగ్‌కు నిలయంగా మారుతోంది.ఈ రోడ్డు బీహెచ్‌ఈఎల్ యాజమాన్యంకి చెందింది కావడంతో జీహెచ్ఎంసీ అధికారులు కూడా పట్టించుకున్న పాపాన పోవడం లేదు.ఈ మార్గంలో నిత్యం వందలాది వాహనదారులు రాకపోకలు సాగిస్తూ ఉంటారు.చెత్త కారణంగా పందులు సంచరిస్తుండడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారుల స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

వాహనాల తనిఖీ

పటాన్‌చెరు టౌన్: ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పటాన్‌చెరు క్రైమ్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ట్రాఫిక్ సిఐ ప్రవీణ్ రెడ్డి హెచ్చరించారు. గురువారం పటాన్‌చెరు పట్టణంలోని పాత టోల్‌గేట్ సమీపంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీలో అమీన్‌పూర్‌కు చెందిన సాంబశివరావు వద్ద 3 లక్షల 40 వేలు పట్టుకున్నారు.అదేవిధంగా అమీన్‌పూర్ పోలీసులు సుల్తాన్‌పూర్ ఎగ్జిట్ ఫోర్ వద్ద నిర్వహించిన వాహనా తనిఖీల్లో విజయవాడకు చెందిన కృష్ణ ప్రసాద్ వద్ద 2 లక్షల 40 వేలు పట్టుకున్నట్లు సీఐ తెలిపారు.

శిల్పారామం.. సాంస్కృతిక సంబురం



శిల్పారామం ప్రధాన ద్వారం



- నేటి నుంచి ఆలిండియా శారీ మేళా
- ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు..
- బతుకమ్మ, దాండియాలో ఔత్సాహికులు పాల్గొనవచ్చు

మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో ఈనెల 13వ తేదీ నుంచి 25వ తేదీ వరకు ఆలిండియా శారీమేళా, బతుకమ్మ, దసరా పండుగలను ఘనంగా నిర్వహించనున్నారు. మేళాకు వచ్చే సందర్శకులను అలరించేందుకు ప్రతి రోజు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. తెలంగాణ పండుగను చేనేత ఉత్సవంతో నిర్వహిస్తారు. మాదాపూర్‌లోని శిల్పారామంను విద్యుత్ దీపాలతో అలంకరిస్తున్నారు. జానపద, పల్లె బతుకమ్మ పాటలతో వేడుకలు నిర్వహిస్తారు. శారీ మేళాలో పోచంపల్లి, గద్వాల్, గొల్లభామ, బెంగళూరు సిల్క్, మదనపల్లి పట్టు, బెంగాలి కాటన్, మహేశ్వరం, బాందిని, ధర్మవరం, వెంకటగిరి, చందేరి, డ్రెస్ మెటీరియల్స్, చున్నీలు లభిస్తాయి.

బతుకమ్మ, దసరా ఉత్సవాలు..

హైదరాబాద్, బెంగుళూరు, కోల్‌కత్తా తదితర ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు ప్రతిరోజు సాయంత్రం మెయిన్‌లాన్‌లో బతుకమ్మ, దాండియా కార్యక్రమాలుంటాయి. ఇందులో ఔత్సాహికులు పాల్గొనవచ్చు.

రోజూ సాంస్కృతిక కార్యక్రమాలు

మేళాలో భాగంగా రోజు సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. అక్టోబర్ 25వ తేదీ వరకు దేవి వైభవం, నవదుర్గ, మహిషాసుర మర్దిని, శక్తిపీఠ ప్రదక్షిణ, లక్ష్మీ, సరస్వతీ నృత్య ప్రదర్శనలు , కూచిపూడి, భరతనాట్యం, ఒడిసి, కథక్, నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేశారు.

ప్రత్యేక కార్యక్రమాలు



శిల్పారామంలో నిర్వహిస్తున్న ఆలిండియా శారీ మేళాలో పాల్గొన్న కళాకారులకు, స్టాల్స్ నిర్వాహకులకు వసతులను కల్పిస్తున్నాము. సందర్శకులను ఆకట్టుకునేందుకు ప్రతి రోజు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. దసరా రోజు జమ్మిపూజ జరుగుతుంది. నగరవాసులు శిల్పారామం అందాలను సందర్శించాలి.

–శిల్పారామం జనరల్ మేనేజర్ అంజయ్య

కాంగ్రెస్ గూటికి జగదీశ్వర్‌గౌడ్?

- శేరిలింగంపల్లి టికెట్ ఖరారైందని ప్రచారం
- డివిజన్లలో దిద్దుబాటు చర్యల్లో ఎమ్మెల్యే గాంధీ



జీహెచ్‌ఎంసీ ఫ్లోర్ లీడర్ జగదీశ్వర్ గౌడ్

గచ్చిబౌలి: బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కార్పొరేటర్‌గా హ్యాట్రిక్ సాధించిన జగదీశ్వర్‌గౌడ్ కాంగ్రెస్ గూటికి చేరుతున్నట్లుగా నియోజకవర్గంలో విస్తృత ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే కాంగ్రెస్ పెద్దలు శేరిలింగంపల్లి అభ్యర్థిగా జగదీశ్వర్‌గౌడ్ పేరును ఖరారు చేసినట్లు విశ్వసనీయ సమాచారం . బీజేపీ నుంచి కొండాపూర్ కార్పొరేటర్‌గా బరిలో నిలిచి ఓడిపోయిన రఘునాథ్ యాదవ్ ఇటీవల కాంగ్రెస్‌లో చేశారు. టికెట్ రఘునాథ్ యాదవ్‌కు ఖాయమైనట్లుగా ప్రచారం జరిగింది. హఠాత్తుగా జగదీశ్వర్‌గౌడ్ పేరు తెరపైకి రావడంతో ఇటు బీఆర్ఎస్ నాయకులు, అటు కాంగ్రెస్ నాయకుల్లో చర్చ జరుగుతోంది. జగదీశ్వర్ గౌడ్ కాంగ్రెస్ నుంచి బరిలోకి దిగితే గట్టి పోటీ ఉంటుందని విశ్లేషకులు భావిస్తున్నారు. బీఆర్ఎస్ నుంచి మాదాపూర్ కార్పొరేటర్‌గా జగదీశ్వర్ గౌడ్, ఆయన సతీమణి పూజితగౌడ్ హఫీజ్‌పేట్ కార్పొరేటర్‌గా ఉన్నారు. ఈ డివిజన్లలో మైనార్టీ ఓట్లు ఎక్కువగా ఉన్నాయి. ఆ ఓట్లు గంపగుత్తగా బీఆర్ఎస్‌కు పడే అవకాశం ఉందని అధికార పక్షం భావిస్తూ వచ్చింది. జగదీశ్వర్ గౌడ్‌కు మైనార్టీలతో పాటు ఇతరు ఓటర్లతోను సత్సంబంధాలుండటం, ఇతర డివిజన్లలోను పరిచయాలు ఉండటంతో ఆయన పార్టీ వీడితే బీఆర్ఎస్‌కు గట్టి దెబ్బ అని చెప్పవచ్చు.

ఫ్లోర్ లీడర్‌గా నియామకం

ఎన్నికల షెడ్యూల్‌కు ముందే మాదాపూర్ కార్పొరేటర్ జగదీశ్వర్‌గౌడ్‌తో కాంగ్రెస్ అధిష్టానం చర్చలు జరిపింది. తనతో సంప్రదింపులు జరిపిన మాట వాస్తవమేనని, కేటీఆర్‌తో తనకు ఉన్న సత్సంబంధాల దృష్ట్యా పార్టీ మారే అవకాశం లేదని జగదీశ్వర్ కొట్టిపారేశారు. కాంగ్రెస్ నుంచి జగదీశ్వర్‌గౌడ్ బరిలో ఉంటే బీఆర్ఎస్ అభ్యర్థి గాంధీ విజయావకాశాలు సన్నగిల్లే అవకాశం ఉందని కేటీఆర్ ఇటీవల జగదీశ్వర్ గౌడ్‌ను ఫ్లోర్ లీడర్‌గా నియమించి వన్ ప్లస్ వన్ గన్‌మెన్లను కేటాయించింది. ఫ్లోర్ లీడర్ నియామకంపై సంతృప్తి చెందని జగదీశ్వర్ మళ్లీ కాంగ్రెస్ పెద్దలతో టచ్‌లోకి వెళ్లినట్లు తెలిసింది. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన తరువాత మ్మెల్యే గాం. దీతోను టచ్‌లో లేడని పార్టీ నాయకులు చెబుతున్నారు. మూడురోజుల క్రితం జగదీశ్వర్‌గౌడ్ ఫోన్లు స్విచ్చాఫ్ చేసి ఉండటంతో ఢిల్లీకి వెళ్లి కాంగ్రెస్ పెద్దలను కలిశారని ప్రచారం జరుగుతోంది. గన్‌మెన్‌ను వదిలి వెళ్లడంతో జగదీశ్వర్‌గౌడ్ పార్టీ మారుతున్నారనే ప్రచారానికి బలం చేకూరుతోంది.

నాయకులతో ఎమ్మెల్యే గాంధీ సమావేశం

బీఆర్ఎస్ నాయకులు, కార్పొరేటర్ జగదీశ్వర్‌గౌడ్‌కు కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి టికెట్ ఖరారు చేసినట్లు ప్రచారం జరుగుతున్న తరుణంలో ఎమ్మెల్యే గాంధీ దిద్దుబాటు చర్యల్లో నిమగ్నమయ్యారు. గురువారం మాదాపూర్, హఫీజ్‌పేట్ డివిజన్లలోని బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో చర్చించారు. జగదీశ్వర్ గౌడ్ పార్టీ మారినా మీకు నేను అందుబాటులో ఉంటానని భరోసా ఇచ్చారు. పార్టీ క్యాడర్ కాపాడుకునేందుకు అన్ని అవకాశాలను పరిశీలిస్తున్నారు.

పార్టీ మారితే చెబుతా : జగదీశ్వర్‌గౌడ్

పార్టీ మారితే చెబుతానని జీహెచ్‌ఎంసీ ఫ్లోర్ లీడర్ జగదీశ్వర్ గౌడ్ 'సాక్షి'తో పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరిక, టికెట్ ఖరారైందని ప్రచారం జరుగుతందని ఫోన్‌లో ప్రశ్నించగా అలాంటిది ఏమి లేదని ఆయన అన్నారు.

హెచ్‌సీయూలో డచ్ ప్రతినిధి బృందం



రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీని డచ్ ప్రతినిధి బృందం గురువారం సందర్శించింది. ఈ బృందం ఇంటర్నేషనల్ అఫైర్స్ ఆఫీస్ డైరెక్టర్ ప్రొఫెసర్ చేతన్ శ్రీవాస్తవ సమన్వయం చేశారు. డచ్ భాష, భారతీయ విద్యాసంస్థల మధ్య బలమైన బంధాన్ని పెంపొందించే దిశగా ఈ సందర్శన ఉంది. ఈ పర్యటనలో భాగంగా సెంటర్ ఫర్ అప్లైడ్ లింగ్విస్టిక్స్ అండ్ ట్రాన్స్‌లేషనల్ స్టడీస్ హెడ్ ప్రొఫెసర్ అరుల్‌మొళి, ప్రొఫెసర్ జే ప్రభాకర్‌రావు, ఇంటర్నేషనల్ అఫైర్స్ ఆఫీస్ డైరెక్టర్ ప్రొఫెసర్ చేతన శ్రీవాస్తవ, ఆఫీస్ ఫర్ ఇంటర్నేషనల్ అసోసియేట్ డైరెక్టర్ ప్రొఫెసర్ అలోక్‌కుమార్ మిశ్రాతో సమావేశమయ్యారు. భారతదేశంలో డచ్ భాష, సంస్కృతిని ప్రోత్సహించడంలో ముఖ్యమైన మైలురాయిని గుర్తించడమే కాకుండా విద్య, భాష అధ్యయనాల రంగంలో అంతర్జాతీయ సహకారం పెంపొందించుకోవడమే ఈ పర్యటన లక్ష్యం.



శిక్షణ తీసుకున్న మహిళలతో కమాండెంట్ సి.సన్నీ, డైరెక్టర్ రామ్మోహన్ తదితరులు

శిక్షణతో స్వయం ఉపాధి

- కొండాపూర్ బెటాలియన్ కమాండెంట్ సన్నీ

గచ్చిబౌలి: స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణతో మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని టీఎస్ఎస్‌పీ కొండాపూర్ 8వ బెటాలియన్ కమాండెంట్ సి.సన్నీ పేర్కొన్నారు. గురువారం కొండాపూర్ బెటాలియన్‌లో మహిళల స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ ముగింపు కార్యక్రమానికి జన శిక్షణ సంస్థాన్ డైరెక్టర్ రామ్మోహన్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టైలరింగ్, ఎంబ్రాయిడరీ, మగ్గంలో మూడు నెలల శిక్షణ తీసుకున్న మహిళలను ఆయన అభినందించారు. అనంతరం వారికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.

కాంగ్రెస్ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారు

- నాయకులు రఘునాథ్ యాదవ్



పార్టీలో చేరిన యువతతో నాయకులు రఘునాథ్ యాదవ్

గచ్చిబౌలి: గచ్చిబౌలి డివిజన్‌లోని గోపన్‌పల్లికి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. గురువారం కొండాపూర్‌లోని పార్టీ కార్యాలయంలో కండువా కప్పి కాంగ్రెస్ సీనియర్ నాయకులు రఘునాథ్ యాదవ్ పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని రఘునాథ్ యాదవ్ పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే నిరుద్యోగ యువతకు న్యాయం జరుగుతుందన్నారు. పార్టీ గెలుపునకు సైనికులవలే కష్టపడాలని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో రాములు నాయక్, శ్రీకాంత్ నాయక్, నర్సింహ, రాజు నాయక్, సుమన్, కిషన్, రవి కుమార్, వెంకటేష్, మల్లేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా అదనపు కలెక్టర్

- ఏర్పాట్లపై అధికారులకు సూచనలు

రాయదుర్గం: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాయదుర్గంలోని పోలింగ్ కేంద్రాలను రంగారెడ్డిజిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ సందర్శించారు. రాయదుర్గంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమికోన్నత పాఠశాల భవనాల్లో ఉన్న సౌకర్యాలు, ఇతర అంశాలను ఆమె పరిశీలించారు. అనంతరం అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లా వ్యాప్తంగా ఎన్నికల పోలింగ్ కేంద్రాల పరిశీలనలో భాగంగా ఆమె పర్యటించారు.ఓటర్లకు ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ, రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు.



రాయదుర్గం పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ ,అధికారులు

బీజేపీ గెలుపు తథ్యం

- పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రవికుమార్‌యాదవ్



రాయదుర్గం: ప్రజా సమస్యలపై పోరాటం చేసింది, ప్రజలకు అండగా ఉంది బీజేపీనేనని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్ స్పష్టం చేశారు. గడపగడపకూ బీజేపీ రవన్న ప్రజాయాత్ర కార్యక్రమంలో భాగంగా శేరిలింగంపల్లి డివిజన్‌లోని శ్రీరామ్‌నగర్ సీ బ్లాక్‌లో ఆయన ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికలలో బీజేపీ గెలుపు తథ్యమన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే బీఆర్ఎస్ పార్టీ నాయకుల అవినీతి అక్రమాలు బయటకి వస్తాయని, ఇక అడ్రస్ గల్లంతైన కాంగ్రెస్ పార్టీ అని ఎద్దేవా చేశారు. బీజేపీ నాయకులు ఎల్లేష్, అనిల్‌కుమార్ యాదవ్, రమేష్, అనంతరెడ్డి, సంజీవరెడ్డి, చంద్రమోహన్ పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్యశిబిరం

హఫీజ్‌పేట్ : ఇటీవల కాలంలో చిన్న వయస్సులోనూ గుండె సమస్యలు వస్తున్నాయని ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ పేర్కొన్నారు. గురువారం హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని జనప్రియనగర్‌లో ఎస్ఎల్‌జీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని ఆసుపత్రి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డీవీఎస్ సోమరాజు, డాక్టర్ వికాస్‌కుమార్ శుక్లాతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యం వ్యాపారంగా మారిన ఈ రోజుల్లో సామాజిక దృక్పథంలో ఉచిత వైద్య శిబిరం ప్రారంభించడం చాలా సంతోషమన్నారు. గుండె వ్యాధుల రహితంగా చేయాలన్న లక్ష్యంలో భాగంగా ఈ శిబిరం నిర్వహిస్తున్నామని ఆసుపత్రి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డీవీఎస్ సోమరాజు తెలిపారు. జనరల్ మెడిసిన్, కార్డియాలజీ, ఆర్థోపెడిక్, డెంటల్, కంటి, రక్తపోటు, మధుమేహం, ఈసీజీ, 2డి ఎకో వంటి వైద్య పరీక్షలు సుమారు 400 మందికి నిర్వహించారు. వైద్యులు సబీల, అజయ్, సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో పరీక్ష చేయించుకుంటున్న ఎమ్మెల్యే గాంధీ

బతుకమ్మ వేడుకలు

మాదాపూర్: మాదాపూర్‌లోని రవీంద్రభారతి పాఠశాలలో గురువారం బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సమీన మాట్లాడుతూ బతుకమ్మ పండుగ విశిష్టత గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ సమీన, డివిజన్ ఇంచార్జీ హఫీజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఈదుల నాగులపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు బతుకమ్మ పాటలు పాడుతూ ఆడారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు బతుకమ్మ పండగ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పోచయ్య, ఉపాధ్యాయులు రాజ్ కుమారి, శ్రీనివాస్ రాథోడ్, జ్యోతి, మురళీధర్ పాల్గొన్నారు.



బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు



మాదాపూర్ రవీంద్రభారతి పాఠశాలలో ..


భెల్ హౌసింగ్ సొసైటీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

శేరిలింగంపల్లి: బీహెచ్‌ఈఎల్ ఎంఐజీ ఎంప్లాయీస్ కో–ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్ ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. ఎన్నికల నిర్వహణాధికారిగా నియమితులైన అసిస్టెంట్ రిజిస్ట్రార్ మాధవరెడ్డి గురువారం నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ నెల 17 తేదీ నుంచి మూడురోజుల పాటు నామినేషన్లు దాఖలు చేసేందుకు అవకాశం ఉంది. 20వ తేదీ నామినేషన్ల పరిశీలన, 21వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ ఉంటుంది. 28వ తేదీ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు.

యూజీడీ పైప్‌లైన్ పనులు పరిశీలన

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని రాంనరేష్‌నగర్ కాలనీలో చేపడుతున్న యూజీడీ పైపులైన్ నిర్మాణ పనులను ,కాలనీలో నెలకొన్న పలు సమస్యలు, తీసుకోవాల్సిన చర్యలపై కాలనీవాసులతో కలిసి గురువారం స్థానిక కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదర్‌నగర్ డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తామని, యూజీడీ వంటి అభివృద్ధి పనులను నాణ్యతతో చేపట్టాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు వెళుతున్నానని తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ ఉపాధ్యక్షుడు పోతుల రాజేందర్, కాలనీవాసులు నక్క శ్రీనివాస్, వెంకటయ్య యాదవ్, సత్యనారాయణ, రాజిరెడ్డి, నాగార్జున రెడ్డి, రవి, కృష్ణారెడ్డి, నక్క సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలు అదృశ్యం



మియాపూర్ : ఇంటినుంచి బయటకు వెళ్లిన వృద్ధురాలు తిరిగి రాని సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడకు చెందిన దగ్గుబాటి శ్యామల(70) వారం క్రితం నగరంలోని మియాపూర్ గోకుల్‌ప్లాట్స్‌లో నివాసముంటున్న అల్లుడు తుమ్మల గోపినాథ్ ఇంటికి వచ్చింది. బుధవారం సాయంత్రం 4 గంటలకు ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లింది. తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో విచారించినా ఆచూకీ లభించకపోవడంతో అల్లుడు గోపినాథ్ మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

చికిత్స పొందుతూ కార్మికుడు మృతి

పటాన్‌చెరు టౌన్: చికిత్స పొందుతూ కార్మికుడు మృతి చెందిన సంఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఏఎస్ఐ లక్ష్మయ్య కథనం ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన ప్రవీణ్ (27) బతుకుదెరువు కోసం సంవత్సరం క్రితం పాశమైలారం కొచ్చి, సూపర్ పాలిమర్ టైర్ల కంపెనీలో పని చేస్తున్నాడు. ఈ క్రమంలో ఈనెల 8వ తేదీన నైట్ షిఫ్ట్ కి వెళ్ళిన ప్రవీణ్ 9వ తేదీ తెల్లవారుజామున రెండు గంటల సమయంలో బాయిలర్ వద్ద పని చేస్తున్న క్రమంలో బాయిలర్ డోర్‌ఓపెన్ చేశాడు. దీంతో ఒక్కసారిగా మంటల తోపాటు, స్టీమ్ బయటకు రావడంతో ప్రవీణ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో చికిత్స కోసం లింగంపల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి, తిరిగి అక్కడ నుండి గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. దీంతో సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించి ,ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.